

రుణమాఫీ చేయాలని నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పెంట్లవెల్లి రైతులు

## రుణమాఫీ కోసం రైతుల ఆందోళన

- నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట నిరసన

నాగర్‌కర్నూల్/పెంట్లవెల్లి, ఏప్రిల్ 7 : పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. సోమవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. పెంట్లవెల్లి సొసైటీ పరిధిలోని కొండూరు, మల్లేశ్వరం, మంచాలకట్ట, మాధవస్వామి నగర్, ఎంగంపల్లి తండా, రామాపురం, సోమశిల గ్రామాలకు చెందిన 150 మంది రైతులు ఈ నిరసనలో పాల్గొన్నారు. ప్లకార్డులు పట్టుకొని రుణమాఫీ చేయాలని నినదించారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. రుణాలను వెంటనే మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు పెంట్లవెల్లిలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి తహసీల్దార్ జయసింహకు వినతిపత్రం అందజేశారు.



సిద్దిపేట కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు రక్షణ సమితి నాయకులు

## రుణమాఫీ చేసి రైతులను ఆదుకోండి

- సిద్దిపేట కలెక్టర్‌కు రైతు రక్షణ సమితి వినతి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 7 : అందరికీ రుణమాఫీ చేయాలని, వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, ప్రైవేటు అప్పుల నుంచి రైతులను రక్షించేందుకు అధికారులు సహకరించాలని రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రామలింగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ మను చౌదరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన రైతులందరికీ బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. రైతులకు రుణాలు మంజూరు చేయాలని హైకోర్టు ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. ఇప్పటికీ చాలామంది రైతులకు పంటరుణాలు మాఫీ కాలేదని, వందశాతం రుణమాఫీ చేయాలని కోరారు.

### సింగూరు ఆయకట్టూ ఎండుతున్నది



*బీఆర్‌ఎస్ హయాంలో సింగూరు నీటిని సంగారెడ్డి జిల్లా సాగునీటి అవసరాలకు వినియోగించడంతో 40 వేల ఎకరాల్లో పంటలు పండాయి. దీంతో సింగూరు ఆయకట్టు మరో కోనసీమను తలపించింది. కాల్వల్లో నీటి సవ్వడులు వినిపించేవి. ఇదంతా గతం. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదమో, అధికారుల నిర్లక్ష్యమో తెలియదు కానీ ప్రాజెక్టు ఎడమ కాల్వ కింద సాగుచేసిన పొలాలకు నీరందక పంటలు ఎండిపోతుండటంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. -అందోల్*

# రైతుపైనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

- తన భూమికి పాస్‌బుక్ కోరినందుకు ఆర్‌ఐ నిర్వాకం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతు శ్రీనివాస్



రైతు శ్రీనివాస్

మహబూబాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : తనకు పాస్‌బుక్కు చేయాలని ఏడాదికిపైగా తిరుగుతున్న రైతుపైనే రెవెన్యూ అధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో చోటుచేసుకున్నది. బాధిత రైతు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన వల్లెపు కనకయ్య 1987లో చనిపోయాడు. ఇతనికి నలుగురు కుమారులు ఉన్నారు. వీరంతా బతుకుదెరువు కోసం హనుమకొండలోని జులైవాడకు వలస వెళ్లారు. ఊరి నుంచి వెళ్లేటప్పుడు వారి తండ్రి కనకయ్య పేరిట 20 గుంటల భూమి ఉన్నది. వీరి తల్లి వెంకటమ్మ 2005లో మరణించింది. అప్పటినుంచి ఆ భూమి తండ్రి కనకయ్య పేరు మీదనే పహాణీలో ఉన్నది. నలుగురిలో పెద్ద కుమారుడు నరసయ్య, రెండో కుమారుడు వెంకటయ్య కూడా చనిపోయారు. ఇక మూడో కుమారుడు యాదగిరి, నాలుగో కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు. తండ్రి పేరు మీద ఉన్న భూమిని తమకు పాస్‌పుస్తకంగా ఇవ్వాలని ఏడాదికిపైగా తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. ధరణిలో దరఖాస్తు చేసుకున్నా పాస్‌పుస్తకం ఇవ్వకుండా కేసముద్రం రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తునారు. ఈ విషయమై సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని ఆర్‌ఐని తహసీల్దార్ 2024 సెప్టెంబర్ 13న ఆదేశించారు. అప్పటినుంచి సర్వే చేసి రిపోర్టు ఇవ్వకపోగా రేపు, మాపు అంటూ తిప్పుకొంటున్నారు. 'ఆ భూమి మీది కాదని, ప్రభుత్వ భూమి' అని రకరకాల సాకులు చెప్పారు. చివరికి రైతు శ్రీనివాస్‌తోపాటు వారి సోదరుల పిల్లలు అంతా కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. అయినా ఆ భూమి సర్వే చేయకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. విసిగిపోయిన శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఆర్‌ఐని నిలదీశారు. దీంతో ఆమె గతనెల 25న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ రైతును పిలిపించి మాట్లాడగా అసలు విషయం వారికి అర్థమైంది. ఆర్‌ఐదే తప్పని తెలుసుకున్న పోలీసులు ఆమెను మందలించారు. తమకు జరిగిన అన్యాయంపై రైతు శ్రీనివాస్ సోమవారం మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన కలెక్టర్ విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని మహబూబాబాద్ ఆర్డీవోను ఆదేశించారు.

## నేడు, రేపు వర్షాలు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో అల్పపీడనంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళ, బుధవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నదని వివరించింది. కొన్ని చోట్ల సాధారణం కన్నా 2-4 డిగ్రీల సెల్సియస్ వరకు ఎండలు పెరుగుతాయని తెలిపింది. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# కేసులపై వెనక్కి తగ్గిన సర్కారు

- హెచ్‌సీయూ నుంచి పోలీసు బలగాల ఉపసంహరణ
- మంత్రుల సబ్ కమిటీ సమావేశంలో నిర్ణయం
- వీసీకి డిప్యూటీ సీఎం భట్టి లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల పోరాటానికి ప్రభుత్వం దిగివచ్చింది. హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి పోలీసు బలగాలను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించింది. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను కూడా ఉపసంహరించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపిం ది. ఈ మేరకు హెచ్‌సీయూ వీసీ బీజేరావు కు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం లేఖ రాశారు. హెచ్‌సీయూలోని కంచ గచ్చిబౌలి భూ సమస్యపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన మంత్రుల సబ్ కమిటీ సోమవారం సచివాలయంలో సమావేశమైంది. సబ్‌కమిటీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన సమావేశానికి కమిటీ సభ్యు లు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచందర్‌రెడ్డి పాల్గొన్నారు. సబ్ కమిటీతో హైదరాబాద్ విశ్వవిద్యాలయ ఉపాధ్యాయ సంఘం (యూహెచ్‌టీఏ), పౌరసంఘాల ప్రతినిధులు సమావేశమై పలు డిమాండ్లను మంత్రుల కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం ముందు విద్యార్థులు పెట్టిన తక్షణ డిమాండ్లను పరిష్కరించకపోవడంతో విద్యార్థి జేఏసీ ఈ సమావేశానికి హాజరుకాలేదని వారు మంత్రులకు వివరించారు. వారి డిమాండ్లను నెరవేర్చిన తర్వాతే విద్యార్థి జేఏసీ నాయకులు మంత్రుల కమిటీ నిర్వహించే సమావేశానికి హాజరవుతారని తెలిపారు. అనంతరం హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి పోలీసు బలగాలను ఉపసంహరిస్తామని, 400 ఎకరాల భూమిని రక్షించడానికి పోలీసుల పహారా తప్పనిసరి అని డిప్యూటీ సీఎం భట్టి పేర్కొన్నారు. క్యాంపస్‌లోని మిగిలిన ప్రాంతాల నుంచి పోలీసులను ఉపసంహరించుకోవాలనే అంశంపై హెచ్‌సీయూ వైస్ చాన్సలర్‌కు ప్రభుత్వం నుంచి లేఖ రాస్తామని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా కేసుల ఉపసంహరణ కోసం పోలీసు, న్యాయ శాఖలతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రుల కమిటీ హామీ ఇచ్చింది. సుప్రీం కోర్టు ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని, తదుపరి కోర్టు ఆదేశాలు జారీ చేసే వరకు అధ్యాపకులు, విద్యార్థులు సహా ఎవరిని 400 ఎకరాల్లో సర్వేకు అనుమతించలేమని స్పష్టంచేసింది. విద్యార్థులు కోరిన విధంగా యూనివర్సిటీని సందర్శించడానికి కమిటీ సానుకూలంగా ఉన్నదని, కానీ, సుప్రీంకోర్టులో కేసు కొనసాగుతున్నందున న్యాయపరమైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికిప్పుడు హెచ్‌సీయూకి మంత్రుల బృందం రాలేదని వెల్లడించింది. సబ్ కమిటీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గతంలో హెచ్‌సీయూ విద్యార్థులు, అధ్యాపకులు, రిజిస్ట్రార్ చేసిన విజ్ఞప్తిని క్రోడీకరిస్తూ యూనివర్సిటీ వీసీకి లేఖ రాసింది.

# పరదాలకూ పైసల్లేవు!

- వానొస్తే వడ్లపై కప్పేందుకు టార్పాలిన్లు కరువు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాల కొరత
- వేయింగ్, తేమ యంత్రాల కొనుగోలుకు నిధుల లేమి
- రూ.80 కోట్లకు పైగా పెండింగ్
- ఈ సీజన్‌లో ఇప్పటికీ టెండర్లు పిలవని వైనం
- పొంచి ఉన్న వాన ముప్పు..



హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాల కల్పనలో సివిల్ సప్లయ్ ఘోరంగా విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వర్షం వస్తే ధాన్యంపై కప్పేందుకు కనీసం పరదాలకూ(టార్పాలిన్లు) దిక్కులేని పరిస్థితి నెలకొన్నది. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలు సమయంలో అందించే టార్పాలిన్లు, వేయింగ్, తేమశాతం లెక్కించే మిషన్లు, ప్యాడీ క్లీనర్లు, కాలిపర్లను ఇప్పటికీ సరఫరా చేయలేదు. వీటి కొనుగోలుకు కనీసం టెండర్లూ పిలువలేదు. సివిల్ సప్లయ్, మార్కెటింగ్ శాఖల సమన్వయ లోపం రైతులకు శాపంగా మారడంతో పాటు వాన ముప్పు పొంచి ఉండడంతో రైతుల్లో ఆందోళన నెలకొన్నది.

### రూ.80 కోట్లకు పైగా బకాయిలు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన వస్తువులను సరఫరా చేసే బాధ్యతను సివిల్ సప్లయ్‌శాఖ మార్కెటింగ్ శాఖకు అప్పగిస్తున్నది. మార్కెటింగ్ శాఖ హాకా, ఆగ్రోస్ ద్వారా పరికరాలు కొనుగోలు చేసి వాటిని సివిల్ సప్లయ్‌కి సరఫరా చేస్తున్నది. అయితే, గత రెండేండ్లుగా హాకా, ఆగ్రోస్‌కు పరికరాల కొనుగోలుకు సంబంధించిన నిధులు చెల్లించలేదని, వీటికి సంబంధించి రూ.80 కోట్లకు పైగా బకాయిలు పెండింగ్ ఉన్నట్టు సమాచారం. బకాయిల విడుదలకు సంబంధించి మార్కెటింగ్‌శాఖ అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారని, దీంతో సరఫరాదారులు టెండర్ వేసేందుకు వెనకాడుతున్నారని, పాత బకాయిలు చెల్లిస్తే తప్ప టెండర్లు వేసేందుకు ముందుకు రాని పరిస్థితి నెలకొన్నదని తెలిసింది.

### ఎఫ్‌సీఐ ఇచ్చే పైసలు ఏమైతున్నయ్?

ధాన్యం కొనుగోలుకు అవసరమైన ప్రతి పైసా ఎఫ్‌సీఐ ఇస్తున్నది. పరికరాల కొనుగోలుకు ఒక శాతం నిధులను మార్కెటింగ్ శాఖకు ఇస్తున్నది. ప్రతియేటా నిధులు వస్తుండగా పరికరాల కొనుగోలుకు సంబంధించి బకాయిలు ఎందుకు పేరుకుపోయాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎఫ్‌సీఐ నిధులు ఇవ్వడం లేదా? లేక మార్కెటింగ్ శాఖ.. హాకా, ఆగ్రోస్‌కు ఇవ్వడం లేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఇప్పటికీ టెండర్లకు దిక్కులేదు..

రాష్ట్రవ్యాప్తంగా వరికోతలు మొదలయ్యాయి. సివిల్ సప్లయ్ అక్కడక్కడ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. కొనుగోళ్లు ప్రారంభమైనా.. కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించేందుకు ఇప్పటివరకు టెండర్లు పిలవకపోవడం గమనార్హం. రైతులకు అవసరమైన టార్పాలిన్లు, వేయింగ్, తేమ మిషన్లు, ప్యాడీ క్లీనర్లు ఎప్పుడు అందిస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. హైదరాబాద్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సాకుతో టెండర్లను పక్కన పెట్టినట్టు సమాచారం.



సాగునీటి కోసం ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

## సాగునీటి కోసం ఈఈకి రైతుల వినతి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 7 : సాగు నీటిని అందించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం బురదగూడ, వంజిరి గ్రామాల రైతులు అధికారులను కోరారు. ఈ రెండు గ్రామాలకు సంబంధించిన మినీ రిజర్వాయర్ కట్ట గతేడాది తెగిపోగా, దానికి మరమ్మతులు చేసి సాగు నీటిని అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం రైతులతో కలిసి కాగజ్‌నగర్ ఈఈ ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ రిజర్వాయర్ కట్ట తెగిపోవడంతో ఈ రెండు గ్రామాల శివారులో దాదాపు 400 ఎకరాలకు సాగు నీరందడం లేదని, ఇందులో నిత్యం నీరు ఉండేలా చూడాలని కోరారు. కుమ్రం భీం రిజర్వాయర్ నుంచి ఈ మినీ రిజర్వాయర్‌లోకి నీరు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## బాదేపల్లి మార్కెట్‌లో రైతుల ఆందోళన

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 7 : మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం రైతులు ఆందోళనకు దిగారు. 120 మంది రైతులు 4,500 క్వింటాళ్ల మక్కజొన్నను మార్కెట్‌కు విక్రయానికి తెచ్చారు. బస్తా తూకం బరువు పెంచాలని ట్రేడర్లు టెండర్లను నిలిపివేయడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఇప్పటికే బస్తాకు 49 కిలోలు తూకం వేస్తుండగా అదనంగా 1300 గ్రాములు తూకం వేయటం ఏమిటని రైతులు మండిపడ్డారు. అకాల ర్షం వస్తే తమ పరిస్థితి ఏమిటని కార్యాలయం వద్ద బైఠాయించారు. విషయాన్ని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాలక వర్గ సభ్యులు, మార్కెట్ కార్యదర్శి నవీన్ చేరుకొని ట్రేడర్స్, రైతులతో మాట్లాడి టెండర్లు మొదలు పెట్టారు.



సచివాలయంలో మంత్రుల సబ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

# ఏ హోదాలో మీనాక్షి సమీక్షలు?

- సచివాలయంలో పార్టీ పరిశీలకురాలి సమావేశాలు
- షాడో సీఎం తరహాలో మంత్రులు, అధికారులతో సమీక్ష
- విద్యార్థులు, ప్రజాసంఘాల నుంచి వినతిపత్రాల స్వీకరణ
- కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి తీరుపై సర్వత్రా విమర్శల వెల్లువ

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్.. సచివాలయంలో సమీక్షలు నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆమె ఏ హోదాలో సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గాంధీభవన్‌కు పరిమితం కావాల్సిన మీనాక్షి నటరాజన్ షాడో సీఎంగా సచివాలయంలో సమీక్షలు పెడుతుంటే.. అసలు సీఎం రేవంత్‌రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షలు చేసుకోవటంపై వి స్మయం వ్యక్తమవుతున్నది. ఢిల్లీ నుంచి రైల్లో రా వాలని తెలిసిన ఆమెకు సచివాలయంలో మంత్రులు, అధికారులతో పార్టీ నేతలు సమీక్షలు నిర్వహించటం రా జ్యాంగ విరుద్ధమని తెలియదా? అని పరిశీలకులు విమర్శిస్తున్నారు. కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యనేత బీజేపీ అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నారని, దేశవ్యాప్తంగా సెంట్రల్ వర్సిటీల అధ్యాపకులు, విద్యార్థులతో కాంగ్రెస్ పార్టీకి ఉన్న సత్సంబంధాలను చెడగొట్టడం కోసమే అలా వ్యవహరిస్తున్నారని అధిష్ఠానానికి నివేదికలు అందినట్టు ప్రచారం జరుగుతున్నది. దిద్దుబాటు చర్యల్లో భాగంగా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను హైదరాబాద్‌కు పంపినట్టు కాంగ్రెస్ శ్రేణుల్లో ప్రచారం జరుగుతున్నది. శనివారం ఆగమేఘాలపై హైదరాబాద్‌కు వచ్చిన నటరాజన్ నేరుగా రాష్ట్ర సచివాలయంలో అడుగుపెట్టారు. అప్పటినుంచి వరుసగా ఆమె షాడో సీఎం తరహాలో మంత్రులను, బ్యూరోక్రాట్లను, అధికారులను పిలిచి సమావేశాలు నిర్వహిస్తున్నారు. సోమవారం కూడా ఆమె సచివాలయం మంత్రులతో సమీక్ష నిర్వహించడంపై విమర్శలు వస్తున్నాయి.

### వినతిపత్రాలు ఆమెకే!

రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి అన్నట్టుగా ఆమె విద్యార్థులు, ప్రజాసంఘాల నుంచి వినతి పత్రాలు స్వీకరించటం, వారికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వటం రాజ్యాంగ ఉల్లంఘనే అని సచివాలయ వర్గాలు అంటున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించాల్సిన సమావేశాలు ఢిల్లీలో పెడతారని, గాంధీభవన్‌లో జరగాల్సిన సమావేశాలను సచివాలయంలో పెడతారని సెటైర్లు వేస్తున్నారు. సీఎం అయ్యాక 41 సార్లు ఢిల్లీకి వెళ్లి సమావేశాలు, సంప్రదింపులు జరిపిన రేవంత్‌రెడ్డి అందులో సగం అంటే కనీసం 20 సార్లు కూడా సచివాలయంలో అధికారులతో సమీక్షలు నిర్వహించలేదని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. హెచ్‌సీయూ క్యాంపస్ గదుల నుంచి విద్యార్థులను బయటికి రానివ్వని పోలీసులు, మీనాక్షికి మాత్రం భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ప్రభుత్వ లాంఛనాలతో వర్సిటీలోకి తీసుకెళ్లడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

### పార్టీలో, ప్రభుత్వంలో ఆందోళన!

మీనాక్షి హెచ్‌సీయూ భూముల వ్యవహారానికే పరిమితం అవుతారా? లేక అన్ని అధికారిక వ్యవహారాల్లో తలదూరుస్తారా? అని ముఖ్యనేత సహా కీలక నేతలు ఆందోళన పడుతున్నట్టు పార్టీలో చర్చ జరుగుతున్నది. పార్టీ ఇన్‌చార్జి ఇలా సచివాలయానికి వచ్చి అధికారిక సమీక్ష నిర్వహించడంపై ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయని మంత్రులు ఆందోళన చెందుతున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మీనాక్షి నటరాజన్ షాడో సీఎంగా చక్కబెడుతున్న పనులతో రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందోనన్న చర్చ ఇటు పార్టీలో అటు ప్రభుత్వంలో జోరందుకున్నది.

### 'కంచ గచ్చిబౌలి'పై హెచ్‌సీయూకు హక్కుల్లేవు

- భువనగిరి ఎంపీ చామల

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : కంచ గచ్చిబౌలి భూములపై హెచ్‌సీయూకు ఎలాంటి హక్కుల్లేవని, ఆ విషయం విద్యార్థులు, అధ్యాపకులకు తెలుసని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు ప్రతిపక్షాల కుట్రలో పావులు మాత్రమేనని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. భూముల వ్యవహారంపై బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్రకు తెరలేపాయని ఆరోపించారు.

### హెచ్‌సీయూకే భూమిని అప్పగించాలి : ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, ఏప్రిల్7 (నమస్తే తెలంగాణ): కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని హెచ్‌సీయూకే అప్పగించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద ఆయన సోమవారం మాట్లాడారు. వర్సిటీ విద్యార్థులపై నిర్బంధకాండను ఆపివేయాలని హెచ్చరించారు.

# 'కంచ' భూములపై కోర్టు ఉత్తర్వుల పొడిగింపు

- 24 వరకూ చెట్ల నరికివేత నిలుపుదల
- సుప్రీంకోర్టు నిర్ణయం తరువాతే విచారణ
- మధ్యంతర ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు



హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచగచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో చెట్లను నరికివేయరాదని పేర్కొంటూ గతంలో జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు సోమవారం మరోసారి పొడిగించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో కేసు విచారణ జరుగుతున్న దృష్ట్యా విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. అప్పటివరకు మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టంచేసింది. ఈ నెల 24లోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ రేణుకయారా ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గచ్చిబౌలిలోని 400 ఎకరాలను టీజీఐఐసీకి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాల్ చేస్తూ, వట ఫౌండేషన్, హైదరాబాద్‌కు చెందిన బాబూరావు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్లు ప్రజాప్రయోజన వ్యాజ్యాలను దాఖలు చేశారు. ప్రజాశాంతి వ్యవస్థాపకుడు పాల్ కూడా సోమవారం పిల్ వేశారు. వీటన్నింటినీ కలిపి ఈ నెల 24న విచారణ చేపడతామని ధర్మాసనం వెల్లడించింది. వట ఫౌండేషన్ తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇదే వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టిందని, తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రీ నుంచి నివేదిక తెప్పించుకుందని తెలిపారు. అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేత చర్యలను నిలిపివేయాలని మధ్యంతర ఆదేశాలు ఇచ్చిందని చెప్పారు. దీంతోపాటు చెట్ల నరికివేతకు అవసరమైన అనుమతులు తీసుకున్నదీ లేనిదీ సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని ఆదేశించిందని చెప్పారు. కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ప్రవీణ్‌కుమార్ వాదిస్తూ, కంచగచ్చిబౌలి భూముల్లో ఏం జరిగిందో రాష్ట్ర ప్రభుత్వం స్థాయీ నివేదిక సమర్పించేలా ఆదేశాలివ్వాలని హైకోర్టును కోరారు. రాష్ట్ర అటవీశాఖ తరపున సీనియర్ న్యాయవాది మేనక గురుస్వామి వాదనలు వినిపిస్తూ, టీజీఐఐసీకి భూమి కేటాయింపును వ్యతిరేకిస్తున్న వాళ్లు, ఆ భూముల్లో నెమళ్లు, జింకలు పారిపోతున్నట్టు నకిలీ వీడియోలు సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వీటిపై నివేదిక సమర్పించాలని పోలీసులను ఆదేశించాలని కోరగా, హైకోర్టు నిరాకరించింది. ప్రస్తుతం వివాదం సుప్రీంకోర్టులోలో ఉన్నదని, అక్కడ నిర్ణయాన్ని బట్టి ఇక్కడ విచారణ చేపడతామని స్పష్టంచేసింది. సుప్రీంకోర్టు విచారణ ఈ నెల 16న జరగనున్నందున ఇక్కడి వ్యాజ్యాలపై విచారణను ఈ నెల 24కు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది.

# హెచ్‌సీయూపై కాంగ్రెస్ నేతల తలోమాట

- హెచ్‌సీయూను ఫోర్త్ సిటీకి తరలిస్తామన్న ఎంపీ మల్లు రవి
- ఆ వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమన్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్
- సీఎం, మంత్రి మాటలకే విలువ
- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తేతెలంగాణ) : హెచ్‌సీయూ భూములపై మంత్రులు, ఎంపీలు, పీసీసీ అధ్యక్షుడు ఎవరికివారు చేస్తున్న ప్రకటనలు విద్యార్థులను అయోమయానికి గురిచేస్తున్నాయి. హెచ్‌సీయూను కంచ గచ్చిబౌలి నుంచి ఫోర్త్‌సిటీకి తరలిస్తామని, అక్కడే భూములు కేటాయించి, భవనాలు నిర్మించి అభివృద్ధి చేస్తామని ఎంపీ మల్లు రవి మీడియాకు తెలిపారు. ఖాళీ భూముల్లో ప్రపంచంలోనే పెద్దదైన ఎకో పార్క్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన ప్రకటనను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. సోమవారం గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఎంపీ మల్లు రవిది వ్యక్తిగత అభిప్రాయమని పేర్కొన్నారు. ఈ అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, కోర్టు నిర్ణయం వచ్చే వరకు దానిపై ఏమి వ్యాఖ్యానించవద్దంటూ సమాధానం దాటవేశారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మీడియతో చిట్‌చాట్ చేశారు. కంచ గచ్చిబౌలి వివాదంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఏదైనా కామెంట్ చేస్తేనే అది ప్రభుత్వ నిర్ణయం అవుతదని, మిగతా వారి మాటలకువిలువలేదని స్పష్టంచేశారు.